82 వస్తే.. 18 వేశారు..!

◆ 'పది' మూల్యాంకనంలో విద్యార్థికి అన్యాయం

◆ రీ వెరిఫికేషన్‌తో వెలుగుచూసిన వాస్తవం

ప్రజాశక్తి బత్తలపల్లి

ఏ విద్యార్థికైనా 10వ తరగతి ఎంతో విలువైనది. అందులో వచ్చే మార్కులు విద్యార్థి భవిష్యత్తు జీవితాన్ని నిర్దేసిస్తాయి. అలాంటిది బాగా చదివే విద్యార్థి అధికారుల చేసిన తప్పిదానికి బలయ్యాడు. అన్ని సబ్జెక్టుల్లో 90కి పైగా మార్కులు వస్తే ఒక్క ఇంగ్లీషులో మాత్రం కేవలం 18 వచ్చాయి. దీంతో విద్యార్థి పది తప్పినటుట్లు మార్కుల జాబితా వచ్చింది. స్వతహాగా బాగా చదివే విద్యార్థి కావడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దీనిపై రీ వెరిఫికేషన్ కోరుతూ పదవ తరగతి బోర్డును ఆశ్రయించారు. రీవెరిఫికేషన్ చేయించగా విద్యార్థికి 18కాదు.. 82 మార్కులు వచ్చాయని తేల్చారు. ఈ ఘటన విద్యాశాఖ అనుసరిస్తున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బాధిత విద్యార్థి తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...



రీవెరిఫికేషన్‌లో 82 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి అంజి మార్కుల జాబితా

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీజ్యోతి హైస్కూల్‌లో గోగుల అంజి అనే విద్యార్థి ఈ ఏడాది 10వ తరగతి చదివాడు. ఇటీవల జరిగిన పది పూర్తి స్థాయి పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లోనూ 90 మార్కులు పైబడి సాధించాడు. ఇంగ్లీష్ సబ్జెక్టులో కేవలం 18 మార్కులే వచ్చాయి. దీంతో పరీక్షల్లో తప్పినట్లు రిజల్ట్ వచ్చింది. విద్యార్థి బాగా చదివేవాడు కావడంతో పాఠశాల ప్రిన్సిపాల్ మిడతల లక్ష్మీనారాయణ విద్యార్థి తండ్రితో మాట్లాడి రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయించాడు. ఈ మేరకు ఇటీవల అధికారులు విద్యార్థి అంజి ఇంగ్లీషు ప్రశ్నాపత్రాన్ని రీవెరిఫికేషన్ చేశారు. రీ వెరిఫికేసన్‌లో 82 మార్కులు వస్తే 18 మార్కులు తప్పుగా వేసినట్లు గుర్తించారు. అధికారులు చేసిన తప్పును సరిదిద్ది విద్యార్థి 82 మార్కులు సాధించినట్లు వివరాలను నమోదు చేసి మార్కుల జాబితాను పంపారు. కాగా అధికారులు చేసిన తప్పిదానికి తమ కుమారుడు నెల రోజుల పాటు తీవ్ర మానసిక క్షోభ అనుభవించాడని, ఏదైనా జరగరానిది జరిగిఉంటే బాధ్యులు ఎవరంటూ విద్యార్థి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో తన కుమారుడికి జరిగిన నష్టం మరే విద్యార్థికీ జరగకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థి అంజి

కొనసాగుతున్న వేట..!

◆ పడుతున్న వేటు ◆ తాడిపత్రి ఘటనపై వరుస చర్యలు

◆ ఓట్ల లెక్కింపు అనంతరం భద్రతపై దృష్టి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల రోజు తాడిపత్రిలో పెద్దఎత్తున చోటు చేసుకున్న ఘర్షణపై వేట కొనసాగుతోంది. ఇందులో 700 మందిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఇప్పటి వరకు 122 మంది అరెస్టు అయ్యారు. ఇంకా 600 మంది వరకు అరెస్టు అవ్వాల్సి ఉంది. కేసుల్లో చిక్కుకున్న వారందరూ ఇతర ప్రాంతాలకెళ్లి తలదాచుకుంటున్నారు. వారి కోసం ప్రత్యేకంగా నాలుగైదు బృందాలు వేటను ప్రారంభించాయి. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారిని అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ముఖ్య నేతలు మాత్రం న్యాయస్థానంను ఆశ్రయించి బయట ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు.

పడుతున్న వేటు

తాడిపత్రి ఘర్షణను ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. ఇదివరకు డిఐజి అమ్మిరెడ్డి బదిలీ అయ్యారు. ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, సిఐ మురళీకృష్ణలు సస్పెండ్ అయ్యారు. ఇంతటితోనే వేటు తప్పలేదు. తాజాగా ఎఆర్ ఎఎస్పీ, స్పెసల్ బ్రాంచ్ సిఐలను బదిలీ చేసి రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్‌పైనా సస్పెన్షన్ వేటు పడింది. ఇలా వరుసగా పోలీసు శాఖలో అధికారులపై వేటు పడుతూ వస్తోంది. ఇంకా ఎంత మందిపై ఈ చర్యలుండనున్నాయన్న గుబులు ఆ శాఖలోని సిబ్బందిలో నెలకొంది. ఇంతటితోనే ఆగకుండా శాఖపరమైన విచారణ కొనసాగుతోంది. ఈ విచారణలో బాధ్యులెవరన్నది తేలితే చట్టపరమైన చర్యలూ ఉండే అవకాశాలున్నాయి కొత్తగా వచ్చిన పోలీసు ఉన్నతాధికారులు పాత తప్పిదాలను సరిచేసే రాబోయే ఓట్ల లెక్కింపుపై దృష్టి సారిస్తున్నారు.

ఓట్ల లెక్కింపు తరువాత ప్రశాంతతపై దృష్టి

ఓట్ల లెక్కింపు తరువాత జిల్లాలో ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా ఉండే విధంగా కొత్తగా ఎస్పీ బాధ్యతలు చేపట్టిన గౌతమి శాలి దృష్టి సారించారు. అల్లర్లు జరిగితే ఏ రకంగా నివారించాలన్న కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నాడు పరేడ్ గ్రౌండ్ మాంక్ డ్రిల్ లాగా ప్రాక్టీస్ కూడా చేయడం గమనార్హం. తాడిపత్రి అల్లర్లలో భాగస్వామ్యులైనట్లు గుర్తించిన 150 మంది పై రౌడీషీట్‌లు సైతం ప్రారంభించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా సిబ్బంది అలర్టుగా ఉండాలని హెచ్చరికలు సైతం చేస్తున్నారు. కేసుల్లో ఉన్నవారు.. పాత నేరస్తులను పిలిపించి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కౌంటింగ్ రోజు పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాట్లను చేపట్టారు.

కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలన చేస్తున్న కలెక్టర్ అరుణ్ బాబు

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

◆ అన్ని ఏర్పాట్లనూ పూర్తి స్థాయిలో చేయాలి

◆ అధికారులకు కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశం

ప్రజాశక్తి-హిందూపురం

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి పటిష్ట భద్రతను ఏర్పాటు చేసి, స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తీసుకెళ్లడానికి, కౌంటింగ్ ఏజెంట్ల కౌంటింగ్ హాల్‌కు వెళ్లేందుకే ప్రత్యేకంగా బ్యారికేట్లను ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి వద్ద ఉన్న బిట్ కళాశాల, లేపాక్షి వద్ద గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీలు చేశారు. భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి తగిన సూచనలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బిట్ కళాశాలలో మొదటి అంతస్తులో సివిల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లో మడకశిర నియోజకవర్గం అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. మొదటి అంతస్తులోని ల్యాబ్‌బ్లాక్‌లో కదిరి నియోజకవర్గం, సెకండ్ ఫ్లోర్ ఈఈఈ బ్లాక్‌లో పెనుగొండ, గ్రౌండ్ ఫ్లోర్ కంప్యూటర్ సైన్స్ ఇంజినీర్ బ్లాక్‌లో హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. పార్లమెంట్ నియోజవర్గానికి విడివిడిగా ఓట్లు లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలకు వెళ్లేందుకు ఈవీఎంలు తీసుకెళ్లాడానికి అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు వెళ్లేందుకు వేర్వేరుగా బ్యారికేడింగ్ ఏర్పాట్లను చేయాలన్నారు. ఓట్లు లెక్కింపు కేంద్రాల్లో సిసి కెమెరాలు, కంట్రోల్ రూమ్‌లో టివిలు ఏర్పాటు చేయాలని కమ్యూనికేషన్ ఇంజినీరును ఆదేశించారు. అంతకు మునుపు లేపాక్షిలోని నాయనపల్లి క్రాస్ వద్ద చోళసముద్రం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పుట్టపర్తి, ధర్మవరం, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. గురుకుల పాఠశాల మొదటి అంతస్తులో పుట్టపర్తి నియోజకవర్గం, రెండో అంతస్తులో ధర్మవరం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ పక్రియ నిర్వహిస్తున్నామన్నారు. హిందూపురం పార్లమెంటు నియోజక వర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ గురుకుల పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్ మూడో నెంబర్ రూమ్‌లో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య, పుట్టపర్తి నియోజకవర్గం ఆర్ఒ భాగ్యరేఖ, ధర్మవరం నియోజకవర్గ ఆర్ఒ వెంకట శివ సాయిరెడ్డి, కదిరి నియోజకవర్గం ఆర్ఒ వంశీకృష్ణ, మడకశిర నియోజకవర్గ ఎన్నికల అధికారి గౌరీ శంకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయాన్ని పెంచుకుందాం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీలో ప్రతి ఒక్కరు సమిష్టిగా పనిచేసి ఆదాయాన్ని పెంచి రాష్ట్రంలోనే సత్యసాయి జిల్లాను మొదటి స్థానంలో నిలుపుకుందామని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి టి.మధుసూదన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం జిల్లాలోని డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ, అకౌంట్స్ డిపార్ట్మెంట్, సూపర్వైజర్లతో తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సు బయలుదేరక ముందే పనితీరును సమీక్షించి ఉండాలని సెక్టార్ వారీగా పనితీరు బాగాలేని సర్వీసులను రీ షెడ్యూల్ చేయాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు కండక్టర్లకు గ్యారేజీ సిబ్బందికి ఆయా డిపోలలో అవగాహన కల్పించాలన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులను ప్రయాణికుల సౌకర్యార్థం శుభ్రంగా ఉంచాలన్నారు. కెఎంపిలను పెంచాలన్నారు. అరుణాచలానికి అధికంగా బస్సులు నడిపిన డిపో మేనేజర్ నరేంద్ర రెడ్డి, అసిస్టెంట్ మేనేజరు హంపన్న, గ్యారేజీ అసిస్టెంట్ ఇంజనీరు రామ్ నిశాంతులను అభినందించి వారికి ప్రశాంత పత్రాలను డిపిటిఒ అందజేశారు.

కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

'ఉపాధి'లో పనికి తగ్గ కూలి ఇవ్వాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉపాధి హామీ పథకం కింద కార్మికులకు పనికి తగ్గట్టుగా వేతనం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెద్దన్న సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పుట్టపర్తి మండల పరిధిలోని వెంగళమ్మ చెరువు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి ఎదురుగానే ఉపాధి కూలీలు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా కూలీలకు పనికి తగ్గ వేతనం రావడం లేదని , 7 వారాలు అవుతున్నా పేస్లిప్ లు ఇవ్వడం లేదని, మస్టర్ అందుబాటులో ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల్లో పేస్లిప్ లు ఇస్తామని మెడికల్ కిట్టు ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచుతామని అన్నారు. బకాయి బిల్లుల విషయంపై అధికారులతో మాట్లాడి తక్షణం చెల్లింపులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న , ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

'భూ రికార్డులు మార్చారు'..!

◆ తమ ఆధీనంలో ఉన్న భూమిని ఇతరులకిచ్చారంటూ దళిత రైతుల ఆవేదన ◆ న్యాయం చేయాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఏళ్ల తరబడి సాగులో ఉన్న తమ పొలాన్ని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరుపై ఆన్‌లైన్‌లో మార్చేశారంటూ ఓ దళిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. తండ్రి ద్వారా తమకు సంక్రమించిన భూమిని తమకు కాకుండా ఇతరులకు ఇచ్చి అన్యాయం చేశారంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమందేపల్లి మండలం చాకార్లపల్లి గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 133-1లో గల 3.81 ఎకరాల భూమిని తమ పేరుపై మార్చి న్యాయం చేయాలంటూ వారు రెవెన్యూ అధికారులను కోరుతున్నారు. బాధిత రైతులు తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

సోమందేపల్లి మండల పరిధిలోని చాకార్లపల్లి సమీపంలో హరిజన సంజీవప్ప(లేట్) అనే రైతు పేరుపై ప్రభుత్వం 1959లో 133-1 సర్వే నెంబర్‌లో 3.81 సెంట్ల భూమి కేటాయించింది. 433 పట్టా నెంబర్ కేటాయిస్తూ పట్టాదారు పాసుపుస్తకం సైతం రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. అప్పటి నుంచి ఈ భూమి సాగుదారుగా సంజీవప్ప ఉన్నారు. సంజీవప్పకు కుమారుడు సజ్జరాయుడు, కూతురు సజ్జమ్మ ఉన్నారు. వీరిలో సజ్జరాయుడుకు కూతురు ఎన్.నవిత, సజ్జమ్మకు కూతురు ఎన్.గంగరత్నమ్మ ఉన్నారు. సజ్జ రాయుడు చనిపోవడంతో అతని కూతురు ఎన్.నవిత, సజ్జమ్మ ఇద్దరూ కలిసి సజ్జమ్మ కూతురు ఎం.గంగరత్నకు సంజీవప్ప పేరుపై ఉన్న 3.81 ఎకరాల భూమిని దాన ఖరారు కింద రాయించి ఇచ్చారు. ఎన్.గంగరత్నకు అనువంశికంగా 2023 సంవత్సరం 9వ నెలలో వన్-బి కూడా వచ్చింది. ఇదిలా ఉండగా ఈ భూమి రికార్డులు ఇటీఇవల ఆన్‌లైన్‌లో మారిపోయాయి. హరిజన సంజీవప్పకు ప్రభుత్వం ద్వారా ఇచ్చిన భూమి 2024వ సంవత్సరం మే నెలలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరుపై ఆన్‌లైన్‌లో మారింది. హరిజన కుటుంబానికి అనువంశికంగా వచ్చిన భూమి ఆ వ్యక్తికి పిత్రార్జితంగా వచ్చినట్లు వన్-బి మారిపోయింది. ఆ వ్యక్తికి పిత్రార్జిత ఆస్తిగా కనబరుస్తూ ఖాతా నెంబర్ 175ను రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఇటీవల హరిజన రైతు కుటుంబం ఆన్‌లైన్‌లో భూమి వివరాలు చూసుకోగా వారి పేరు కన్పించలేదు. దీంతో ఆందోళనకులోనై రెవెన్యూ అధికారులను సంప్రదించారు. రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పి పంపారు.



ఇటీవల సజ్జారెడ్డి పేరుతో ఆన్‌లైన్‌లో వచ్చిన భూ వివరాలు..



22-8-2023న లక్ష్మన్న పేరుపై వచ్చిన వన్-బి

దళిత కుటుంబానికి న్యాయం చేయండి

చాకార్లపల్లి గ్రామంలో హరిజన సంజీవప్ప పేరుపై ప్రభుత్వం ఇచ్చిన డిపట్టా భూమిని ఇటీవల ఆన్‌లైన్‌లో పేరు మార్చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. అసైన్మెంట్ చట్టం ప్రకారం సంబంధిత భూమి దళిత కుటుంబ సభ్యులకే చెందాలి. దళితుల భూములకు రక్షణ లేకుండా రెవెన్యూ అధికారులు వ్యవహరించిన తీరు సరికాదు. ఈ సమస్యపై బాధితుల పక్షాన తాము పోరాటం చేస్తాం. ఉన్నతాధికారులను సంప్రదిస్తాం.. న్యాయ పోరాటం కూడా చేస్తాం.

పెద్దన్న, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి.

విచారణ చేసి.. న్యాయం చేస్తాం..

133-1 సర్వే నెంబర్‌లో 3.81 ఎకరాల భూమికి సంబంధించి రికార్డులను పరిశీలించాం. ఇందుకు సంబంధించి సజ్జా రెడ్డి అనే వ్యక్తికి సంబంధించి రికార్డులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భూమికి సంబంధించిన ఆధారాలు తీసుకురావాలని సంబంధిత దళిత రైతులకు మూడుసార్లు నోటీసులు పంపాం. వారి నుంచి స్పందన లేకపోవడంతో వీఆర్వో, ఆర్ఐలను క్షేత్రస్థాయికి పంపించి పరిశీలించాం. పరిశీలన అనంతరం కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సజ్జారెడ్డి పేరుపై భూమిని బదలాయించాం. ఇప్పటికీ దళిత రైతులు వారి భూమికి సంబంధించిన ఆధారాలతో కార్యాలయానికి వస్తే విచారణ చేసి న్యాయం చేస్తాం.

అంజనాదేవి, తహశీల్దార్, సోమందేపల్లి.

చురుగ్గా శ్రామిక, కర్షక భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రంలోని ప్రశాంతి గ్రామ్ వద్ద ఏర్పాటు చేస్తున్న జిల్లా శ్రామిక కర్షక భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నట్లు సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు ఓబులుతోపాటు పలువురు నాయకులతో కలసి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మొదటి అంతస్తుకు మంగళవారం స్లాబ్ (పైకప్పు) పనులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ శ్రామిక కర్షక భవనం వల్ల ఆ వర్గాలకు ఎంతో ఉపయోగమన్నారు. సభలు సమావేశాలు నిర్వహించుటకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి కృషి చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకత్వాన్ని ఆయన అభినందించారు. పార్టీ సానుభూతిపరులు విరివిగా విరాళాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్, సీనియర్ నాయకులు రామకృష్ణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సిద్ధు పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న నాయకులు

గణితం, చిత్రలేఖనంపై అవగాహన

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని చలపతి స్కూల్‌లో వేసవి వినోదం కార్యక్రమం కింద విద్యార్థులకు శాస్త్రీయ ధృక్పథం పెంపుదల, గణిత సమస్యల సులభ సాధన, చిత్రలేఖనం, మ్యాజిక్, తదితర అంశాలలో అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బి నర్సారెడ్డి తెలిపారు. వారం రోజులు పాటు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. 9 నుంచి13 సంవత్సరాల విద్యార్థులు ఉచితంగా తరగతులకు హాజరు కావచ్చని తెలిపారు. మూడవ రోజైన బుధవారం హస్తకళలు, చిత్రలేఖనం అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. కదిరి మండలం పట్నం ఉన్నత పాఠశాల చెందిన క్రాఫ్ట్ టీచర్ కౌసర్ సుల్తానా, నల్లచెరువు హై స్కూల్ కు చెందిన డ్రాయింగ్ టీచర్ మద్దిలేటి విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న కుమార్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు .

అవగాహన కార్యక్రమంలో చిన్నారులు, అధికారులు

సమయానికి రాని సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- చిలమత్తూరు

చిలమత్తూరు సచివాలయం-1కు సంబందించి ఉద్యోగులు సమయానికి విధులకు హాజరుకావటం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు మంగళవారం ఉదయం పది గంటలు అయినా ఆరుగురు సచివాలయానికి హాజరు కాలేదు. ఈ విషయం సామాజిక మాద్యమాలలో చక్కర్లు కొట్టడంతో కార్యదర్శి రామ్లా నాయక్ సీరియస్ అయ్యారు. సమయానికి విధులకు హాజరు అయి బయోమెట్రిక్ వేయవల్సిన సచివాలయ ఉద్యోగులు ఆ పని చేయలేదని అన్నారు. పలుమార్లు చెప్పిన మాట వినని కారణంగా అందరికీ షోకాజ్ నోటీసులు అందజేశామన్నారు. ఇలాంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలను సీజ్ చేస్తామని డివైఇఒ రంగస్వామి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలను ఎంఇఒ గంగప్పతో కలిసి తనిఖీ చేశారు. శ్రీ చైతన్య పాఠశాలలో నోటు పుస్తకాలు, విద్య సామాగ్రి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులతో వారు ఆకస్మికంగా తనిఖీ చేసి, పాఠశాలలోని గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా డివైఇఒ మాట్లాడుతు పాఠశాలలు ప్రారంభం కాక మునుపే అడ్మిషన్లు నిర్వహించినా, క్యాంపెయిన్లు జరిపినా, నోటు పుస్తకాలు, విద్యా సామాగ్రిని పాఠశాలలో విక్రయించినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. పాఠశాలలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని, ఫీజు స్ట్రక్చర్‌ను పాఠశాల నోటీస్ బోర్డులో పొందుపరచాలని ఆదేశించారు. ఎక్కువ ఫీజులు వసూలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాల గదిని పరిశీలిస్తున్న అధికారులు

పరిటాల సునీత జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మాజీ మంత్రిపరిటాలసునీత జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలోటీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు.ఈ ఎన్నికలలో పరిటాలసునీత భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమన్నారు.

ఒంటరి మహిళకు చేయూత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజు పల్లి గ్రామంలో ఒంటరి మహిళ శ్యామలమ్మకు పుట్టపర్తి యువకులు చేయూతనందించారు. ఒంటరి మహిళ ఇబ్బందులను పుట్టపర్తికి చెందిన ఖిద్మత్ -ఏ- కల్కి సభ్యుల దృష్టికి తీసుకురాగా వారు తన మిత్రుడైన ఆర్కే నాయుడు సహకారంతో కుట్టు మిషన్ వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో షాకీర్, సురేష్, సోహెల్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 51 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు శ్రీ సత్య సాయి జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 29 సెంటర్లలో 3591 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా1824 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి - రొద్దం

స్థానిక గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ అధికారి రమ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులున పరిశీలించారు. వేసవి శిక్షణ శిబిరం నిర్వహణ గురించి గ్రంథాలయ అధికారి నాగరాజును అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయానికి రావలసిన బకాయిలు రాబట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఖరీఫ్ సీజన్లో వేరుశనగ సాగు చేసే రైతాంగానికి బుధవారం నుంచి ఆయా ఆర్బీకేలలో విత్తన వేరుశనగకాయలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి తెలిపారు.ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విత్తన వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు భరోసా కేంద్రాల వద్ద వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ విత్తనాలు నాణ్యతగా లేకపోయినా, నాసిరకంగా ఉన్నా వాటిని వెనక్కి అందజేసి నాణ్యమైన వేరుశనగ తీసుకువెళ్లాలని సూచించారు. విత్తనం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

30న బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని శ్రీప్రసన్న లక్ష్మి వెంకటేశ్వర స్వామిదేవాలయంలో ఈ నెల 30వ తేదీన కళ్యాణ బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు వెచ్చం అమర్ నాథ్, అధ్యక్షులు యాడికి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ప్రగతి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం పెనుకొండ పట్టణంలోని ఆలయ ప్రాంగణంలో బ్రహ్మ రథోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వెచ్చం అమర్ నాథ్ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణ బ్రహ్మ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

ప్రజాశక్తి మడకశిర

మండల పరిధిలోని ఉక్కడం రంగాపురం సమీపంలో చెక్‌పోస్టు ఏర్పాటుకు జిల్లాస్థాయి అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల హైవే రోడ్డు పనులు చేయడంతో ఆ మార్గంలో వాహనాలు రాకపోవడంతో స్థల పరిశీలన చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారి నరసింహమూర్తి, మార్కెట్ యార్డ్ అధికారి నాగేంద్ర కుమార్, కుళ్లాయప్ప, శ్రీరాములు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని బాలయేసు డిగ్రీ కళాశాలలో జూన్ 1వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస బాలాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ బాలాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వర్క్ ఎక్స్ సంస్థ వారు టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారన్నారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనటానికి కనీస విద్యార్హత పదవ తరగతి నుండి డిగ్రీ పాస్ ఫెయిల్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. హిందూపురం, పుట్టపర్తి, కదిరి, పెనుగొండ, సోమందేపల్లి మండల గ్రామీణ నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 95131 33003 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

చిన్నారులకు చేయూత

ప్రజాశక్తి కొత్తచెరువు రూరల్

తల్లిదండ్రులు మృతిచెందడంతో అనాథలుగా మారిన చిన్నారులకు నల్లమాడకు చెందిన వైసీపీ యువనేత టీడీ. కృష్ణ సుమన్ రెడ్డి తన వంతుగా చేయూతను అందించారు. ఇంటికరి అవసరమైన సామగ్రితో పాటు చిన్నారులకు దుస్తులు, నిత్యావసర సరుకులను అందజేశారు.

మార్కెట్ యార్డ్ మేకల సంతతో ఉపాధి

కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డులోని మేకల సంతలో నిర్వహిస్తున్న క్రయ విక్రయాలు

ప్రభుత్వానికి ఏడాదికి రూ. 48 లక్షల ఆదాయం
గేటు వసూలు తగ్గించాలని రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కరువుకు మారుపేరు కదిరి ప్రాంతం. కేవలం వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న కదిరి ప్రాంతానికి కదిరి మార్కెట్ యార్డు, మేకల సంత ఊరట నిస్తోందని రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. మేకలు గొర్రెలు పొట్టేలను పెంచి పోషించుకొని క్రయ,విక్రయాలు జరిపి, కొంతవరకు జీవనోపాధి పొందుతున్నామని రైతులు అంటున్నారు. మండలంలోని కుమ్మరివానులపల్లి సమీపాన యార్డులో ప్రతి మంగళవారం మేకల సంత జరుగుతుంది. ఈ సంతకు కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్ర వ్యాపారస్తులు అధిక శాతం వస్తుంటారు. మరి కొంతమంది రైతులు మాట్లాడుతూ పొట్టేళ్లకు షెడ్లు నిర్మించి దానా, పచ్చిగడ్డితో పెంచి పోషిస్తున్నామన్నారు. ఒక సంవత్సరము పాటు పెంచి పోషిస్తే ఒక్కొక్క మేకపోతు, ఒక్కొక్క పొట్టేలు 15వేల రూపాయలు వరకు క్రయవిక్రయాలు జరుపవచ్చునని రైతులు వివరించారు. వ్యవసాయ పంటలు సాగు చేసినా పెట్టుబడులు సైతం రావడం లేదన్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా మేకల వ్యాపారం చేస్తున్నామని కొంతమంది రైతులు తెలిపారు. గొర్రెల సంతలతో వచ్చిన ఆదాయంతోనే పిల్లలకు చదివించుకుంటున్నామన్నారు. ప్రభుత్వం రైతులకు రుణ సహాయ సహకారాలు అందిస్తే మరింత ఆర్థికంగా మెరుగుపడతామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మేకలు గొర్రెలకు మార్కెట్‌కు తీసుకువెళ్లాలంటే ఖర్చులు ఎక్కువ వస్తున్నాయన్నారు. ఒక్కొక్క మేకపోతుకు 40 రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. గతంలో ఉన్న 20 రూపాయల నుండి 30 రూపాయలకు పెంచారని, అది మార్చి నెల నుండి 40 రూపాయలు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటి పైన మార్కెట్ యార్డ్ కార్యదర్శి జగదీష్ మాట్లాడుతూ మార్చి నుంచి 40 రూపాయలు చేసిన విషయము వాస్తవమేనన్నారు. తగ్గించడానికి ఎలాంటి అవకాశం లేదన్నారు. మార్కెట్ యార్డ్ కమిటీ సమావేశంలో చర్చిస్తామన్నారు. మార్కెట్ యార్డులోకి వస్తున్న రైతాంగానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పశువులను మార్కెట్ యార్డు సంతలో విక్రయాలు జరగకపోతే అక్కడే షెడ్లలో పశువులను ఉంచుకోవచ్చు అన్నారు. వాటికి పశుగ్రాసం రైతులే సమకూర్చుకుంటారన్నారు. పశువులకు నీటి సౌకర్యం కల్పించామన్నారు. రైతులకు తాగడానికి నీటి సౌకర్యం కల్పించి, పన్ను రేటు తగ్గించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి వరకు 93 వేల గొర్రెలు, 8000 ఆవులు క్రయ,విక్రయాలు జరిపినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి జగదీష్ తెలిపారు. వీటితో ప్రభుత్వానికి గత ఏడాది 48 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆవులు ఎద్దులు లోడు అన్లోడ్ చేయడానికి అవసరమైన సౌకర్యాలను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

హిందూపురంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు డాక్టర్ మంజుశ్రీ

పుట్టపర్తిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు డాక్టర్ నివేదిత

ప్రజాశక్తి-హిందూపురం

రుతుక్రమం శారీరక ధర్మమని, ఆ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్యురాలు మంజుశ్రీ పేర్కొన్నారు. రుతు క్రమం, పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని లక్ష్మీపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో మహిళలకు, యుక్తవయసు ఆడపిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ ముస్తఫా, ఆరోగ్య కార్యకర్తలు తిమ్మక్క, హసీలా, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, మహిళలు, యుక్త వయసు ఆడపిల్లలు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మహిళలకు ప్రతినెల సంభవించే రుతుక్రమం పై అపోహాలు పెట్టుకోవలసిన అవసరం లేదని జిల్లా ఎన్సిడి ప్రోగ్రాం అధికారి, డాక్టర్ నివేదిత పేర్కొన్నారు. మంగళవారం పుట్టపర్తి ఆరోగ్య కేంద్రంలో రుతుక్రమం, ఆరోగ్యం పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా పిహెచ్‌సి వైద్యురాలు జ్యోష్న ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతు చక్రం ప్రతినెల జరగడం సహజమని దానిపై అపోహాలు పెట్టుకోవద్దని అన్నారు. మహిళలు ధృఢంగా ఆరోగ్యంగా ఉండడానికి పోషకాహారం తీసుకోవాలన్నారు. యుక్త వయసు ఉన్న కళాశాల, పాఠశాలలకు వెళ్లే బాలికలు నాప్కిన్ ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఐరన్ మాత్రలను కూడా వాడాలన్నారు. శారీరక వ్యాయామంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరమన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి నగేష్, వైద్యాధికారి మునిచంద్రిక, ఆరోగ్య కార్యకర్తలు పరిమళ, సుహాసిని, ఆశా కార్యకర్తలు ముత్యాలమ్మ, శంకరమ్మ పలువురు మహిళలు పాల్గొన్నారు.

లేపాక్షి :స్థానిక అంగన్వాడీ కేంద్రంలో మంగళవారంకిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆహారపు అలవాట్లు, శారీరక మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ రెడ్డి రమణమ్మ, సూపర్ వైజర్లు శ్రీలక్ష్మి, మంజుల, జయమ్మ, లలిత, శాంతమ్మ, సచివాలయ మహిళ పోలీసులు గాయిత్రి, ఉష అంగన్వాడీ ఆయాలు, బాలికలు తదితరులు పాల్గొన్నారు

కౌంటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

సార్వత్రిక ఎన్నికలు-2024లో భాగంగా జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై కౌంటింగ్ ఏజెంట్లకు జాయింట్ కలెక్టర్, ఆర్ఒ అభిషేక్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతు హిందూపురం నియోజకవర్గానికి సంబంధించి రూరల్ మండలం బిట్ కళాశాలలోని గ్రౌండ్ ఫ్లోర్ లో ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. లెక్కింపు కోసం ప్రతి అభ్యర్థి 16 మంది ఏజెంట్లు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఎంపిక చేసిన 16 మంది వివరాలను ఫారం-18లో దరఖాస్తులో పూర్తిచేయాలన్నారు. కౌంటింగ్ జరిగే సమయంలో ఏజెంట్లకు అల్పాహారం, టి, కాఫీ ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థులందరు ఎంపిక చేసిన ఏజెంట్లను నిర్ణయించిన సమయంలోగా వారి వివరాలను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, తహశీల్దార్ శివ ప్రసాద్ రెడ్డి, ఎన్నికల డిప్యూటి తహశీల్దార్ రెడ్డి శేఖర్, ఇతర అధికారులు, వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని గుమ్మయ్య గారి పల్లి సమీపన పుట్టపర్తి నుండి కొడుకుని చెక్ పోస్ట్ కు వెళ్లేందుకు జాతీయ రహదారి ఏర్పాటుకు ఇళ్లు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం స్థానిక రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఇదే సందర్భంలో పోలింగ్ స్ట్రాంగ్ రూములు పరిశీలించడానికి అటుగా వెళుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ బాధితులతో మాట్లాడారు. ఈసందర్భంగా వారు తమ సమస్యతో కూడిన వినతి పత్రం అందజేశారు ఎన్నికల కౌంటింగ్ అనంతరం సమస్యను జాతీయ రహదారి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని జేసీ హామీ ఇచ్చారు.

జేసీకి సమస్యను వివరిస్తున్న బాధితులు

ప్రమాదంలో గాయపడ్డ ఉపసర్పంచి మృతి

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లికి చెందిన వైసిపి నాయకుడు ఉపసర్పంచి హుస్సేన్‌బాషా మంగళవారం మృతిచెందాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆయన బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు 20 రోజుల కిందట ఎన్నికల ప్రచారంలో భాగంగా కదిరి వైసిపి అభ్యర్థి బిఎస్ మక్బూల్ బాషాకు మద్దతుగా ప్రచారంలో పాల్గొని కదిరికి ద్విచక్ర వాహనం వెళుతున్న సమయంలోవెనకవైపు బొలెరో ఢీకొట్టడంతో గాయపడ్డాడు. 20 రోజులు బెంగుళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు మృతునికుటుంబ సభ్యులు తెలిపారు. మృతిని కుటుంబాన్ని వైసీపీ నాయకులు పరామర్శించి తమ సంతాపం వ్యక్తం చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కొనసాగుతున్న పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా మంగళవారం సైతం పోలీసుల తనిఖీలు కొనసాగాయి. జిల్లా వ్యాప్తంగా సీఐలు, ఎస్ఐ లు , సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సమస్యాత్మకమైన ప్రాంతాలలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్లో సిఐలు ,ఎస్ఐలు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు.

బత్తలపల్లి : సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెలువడనున్న నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో, ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. కౌంటింగ్ నేపథ్యంలో శాంతి కమిటీలు ఏర్పాటు, సమావేశాలు నిర్వహించి ఎన్నికల కౌంటింగ్ అనంతరం కూడా ఎలాంటి అల్లర్లు,గొడవలు జరగకుండా అందరూ సహకరించాలని సూచనలు చేస్తున్నట్లు ఎస్ఐ ఈసందర్భంగా తెలిపారు.

పోలీసులకు సూచనలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

లేపాక్షి : మండలంలోని కల్లూరు, కొండూరు గ్రామాలలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు.రికార్డులు లేని 10 వాహనాలు సీజ్ చేశారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతిభద్రతలకు విఘాలం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో హిందూపూర్ రూరల్ ఈరన్న , లేపాక్షి ఎస్ఐ గోపి, ఎఎస్ఐ సర్ఫుద్దీన్, రమణ నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఇఒ కృష్ణానాయక్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సి భవన్‌లో మండలంలోని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గోరుముద్ద పథకంపై మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ హంసలేఖ, ఎంఎస్ఐ ఆంజనేయులు, కంప్యూటర్ ఆపరేటర్ శకుంతల, సీఆర్పీలు రమేష్, జంపాల వెంకటరమణ, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఆసియా, ఆదిలక్ష్మి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని మండల విద్యాధికారి గోపాల్ తెలిపారు. మంగళవారం పట్టణంలో ఉర్దూ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్నం భోజన ఏజెన్సీ పథకంపై ఏజెన్సీలకు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 102 ప్రభుత్వ పాఠశాలలున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నబీరసూల్, జిల్లా రిసోర్స్ పర్సన్ సాయి వాణి, సీఆర్పీలు, భోజన ఏజెన్సీ నిర్వాకులు పాల్గొన్నారు

అనుమతి లేని ఎరువులు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - నంబుల పూలకుంట

ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అనుమతి లేని విత్తనాలు, ఎరువులు ఇతర మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు అందరూ లైసెన్సు నిబంధనలకు లోబడి వ్యాపారం నిర్వహించాలని ఆదేశించారు ఫర్టిలైజర్ షాపుల వద్ద నిల్వ, ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి గ్రామములో రైతు భరోసా కేంద్రం వద్ద వ్యవసాయ సహాయకులు ఈ సీజన్లో అందుబాటులో ఉంటారని ప్రతి రైతు వ్యవసాయానికి సంబంధించిన సలహాలు సూచనలు అడిగి తెలుసుకోవాలని సూచించారు.

జంతు సంరక్షణ నోడల్ అధికారిగా ఎఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

హైకోర్టు ఆదేశాల మేరకు పశువుల, జంతువుల సంరక్షణ చట్టాల అమలుకు శ్రీ సత్యసాయి జిల్లాకు నోడల్ అధికారిగా జిల్లా అదనపు ఎస్పి ఎన్. విష్ణుని నియమించారు. పశువులు, జంతువుల సంరక్షణ చట్టాల అమలు సక్రమంగా జరగడానికి గాను అదనపు ఎస్పి ఎన్ విష్ణు ని జిల్లా స్థాయి నోడల్ అధికారి గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జంతువుల అక్రమ రవాణా, అక్రమ వధ విషయంలో ప్రజలకు ఏవిధమైన సమాచారం గాని, ఏదైనా ఇబ్బంది గాని జరిగినట్లయితే జిల్లా స్థాయి నోడల్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చున్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలో ఇప్పటికే గోవధ నిషేధంలో ఉందని, దీనికి ప్రజల సహకరించాలని కోరారు. అంతేకాక జంతువు సంరక్షణ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి

పెనుకొండలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి

కదిరిలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి

ధర్మవరంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి

హిందూపురంలో రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి -పెనుకొండ

పట్టణంలోని హిందూపురం పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో ఆపార్టీ ఎంపీ అభ్యర్థి బికె. పార్థసారథి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్ టి ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కురుబ కృష్ణమూర్తి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.అదే విధంగా పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు ఆపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, సవితమ్మ తదితరులు ఎన్ టి ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 5మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబుల పూలకుంట : ఎన్‌టిఆర్ జయంతి టిడిపి మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనప్ప నాయుడు, వంకమద్ది నరసింహులు, పవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి రూరల్: ఎన్‌టిఆర్ జయంతిని పెడపల్లి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుదేశం నాయకులు, మండల కన్వీనర్ విజయ్ కుమార్ ,మాజీ సర్పంచ్ శ్రీరామ్ నాయక్, ఆకుల కుల్లాయప్ప శివప్ప, బొమ్మయ్య, గడ్డం కష్ణా నాయక్, మబ్బాస, మోతిలాల్ నాయక్, సతీష్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కదిరి టౌన్ : నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో కదిరి నియోజవర్గ తెలుగుదేశ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. నాయకులు డైమండ్ ఇర్ఫాన్, మోపురి శెట్టి చంద్రశేఖర్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను నల్లచెరువుతెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనప్ప, వేణుగోపాల్, మాబు సాబ్ తదితరులు పాల్గొన్నారు

రొద్దం : ఎన్టీఆర్ జయంతి వేడుకలు మండల నాయకులు నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం నాయకులు నరసింహులు, సుబ్బరత్నమ్మ, లీలావతమ్మ, చిన్నప్పయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : రాజకీయాలలో తనదైన ముద్ర వేసిన వ్యక్తి నందమూరి తారక రామారావు అని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ఎమ్మెస్ రాజు అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, నాయకులు లక్ష్మి నారాయణ, అడ్వకేట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : ఎన్‌టిఆర్ జయంతిని టిడిపి మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. కన్వీనర్ జయప్ప ఇంటి వద్ద ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాల లు వేసి నివాళులు అర్పించారు.

ధర్మవరం టౌన్ : నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, చింతలపల్లిమహేశౌచౌదరి, ఫణికుమార్, మద్దిలేటి, పోతుకుంటలక్ష్మన్న, పురుషోత్తంగౌడ్, తలారి చంద్రమోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా తెలుగుయువత ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నారువిజయ్ చౌదరి, నాయకులు అమరాసుధాకర్, సంగాల బాలు, తొగట అనిల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను మాజీ ఎమ్మెల్యేగోనుగుంట్ల సూర్యనారాయణ వర్గీయులు మంగళవారం ఘనంగా జారుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల వర్గీయులు చిగిచెర్ల అరవిందరెడ్డి, దుస్సాక్రిష్ణ, చిలకం సూర్యనారాయణరెడ్డి, బొడగలగిరిధర్, బెస్తశివ, పొరాళ్లరహీం, బొట్టుశీన, జాస్తీప్రకాశ్, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

ఓబుళదేవర చెరువు: ఎన్‌టిఆర్ జయంతినిమండలంలోని ఓడి చెరువు, కొండకమర్ల, తదితర గ్రామాలలో టిడిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టా ఓబుల్ రెడ్డి, జయచంద్ర, పీట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఎన్‌టిఆర్ జయంతిని టిడిపి నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎద్దుల రాముడు, ఖాదర్ బాషా, భువనేశ్వరి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలో ఎన్టీఆర్ జయంతినిమాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూరి వర్గీయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్ నాథ్ రెడ్డి ,కంఠ గాని నారాయణస్వామి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

మడకశిర : నియోజక వర్గ పరిధిలోని రొల్ల మండల కేంద్రం రొళ్ల బస్టాండ్ ఆవరణంలో ఎన్‌టిఆర్ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీఎం పాండురంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : బడుగు బలహీన వర్గాల లో రాజకీయ చైతన్యం తెచ్చిన ఘనత ఎన్‌టి రామారావుకే దక్కుతుందని టిడిపి నాయకులు కొనియాడారు. మంగళవారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, తెలుగు యువత నాయకులు అంబులెన్స్ రమేష్, మాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : ఎన్టీఆర్ జయంతి వేడుకలు పట్టణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు కార్యకర్తలు నాలుగు సింహాల ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రూరల్ మండలం కిరికెర వద్ద మాజీ సర్పంచి రాము ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు షఫివుల్లా, రామాంజనమ్మ, నాయకులు అమర్నాథ్, మంగేష్, దుర్గా నవీన్, అజ్మతుల్లా, శ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.